



# తిరువళ్లూరులో ఘనంగా నేషనల్ స్పేస్‌డే ప్రారంభం




శ్రీహరికోట (తడ), జూలై 31 ప్రభాతవార్త : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో జరుగుతున్న నేషనల్ స్పేస్ డే 2024 కార్యక్రమాలు బుధవారం చెన్నైకి సమీపంలోని తిరువళ్లూరులో ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరువళ్లూరులోని ప్రత్యూష ఇంజనీరింగ్ కాలేజిలో ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రెండురోజుల పాటు ఇక్కడ స్పేస్‌డే ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. చంద్రయాన్-3 జాబిల్లికి దిగిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆగస్టు 23న జాతీయ సైన్స్‌డేని ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో తొలి ఏడాది పలుచోట్ల ఘనంగా స్పేస్‌డే జరుపుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఒడిస్సాలోని భువనేశ్వర్, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఈ కార్యక్రమాలు జరిగాయి. బుధవారం తమిళ నాడులో కార్యక్రమాలు మొదలు పెట్టారు. చిన్నప్పటి నుంచి సైన్స్ మీద, అంతరిక్షం మీద విద్యార్థులు దృష్టి నిలపాలని షార్ డైరెక్టర్‌తో పాటు పలు వురు పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఎంఎస్ శాంతి, డిఎస్ మణి తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు స్పేస్ ఎగ్జిబిషన్, మొబైల్ వాహనంలో ఇస్రో విజయాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులు పంపిణీ చేస్తారు.

# కొత్త చట్టాలపై అవగాహన కల్పించాలి

**- ముఖ్య కూడళ్లల్లో సిసి కెమెరాలు తప్పనిసరి- నేరసమీక్ష సమావేశంలో ఎస్పీ మణికంఠ**



సమావేశంలో పోలీసులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

చిత్తూరు, జులై 31 ప్రభాతవార్త: దేశంలో కొత్తగా అమలులోకి వచ్చిన చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాల యంలోని సమావేశభవనంలో బుధవారం ఎస్పీ మణికంఠ చందోలు జిల్లా పోలీసు లతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా విధులు నిర్వర్తించి ప్రజలతో సఖ్యతతో వుండి చట్టంపై గౌరవం పెంచేలా మెలగాలన్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ద వహించి త్వరితంగా పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పాత నేరస్తులపై నిఘా వుంచాలని, రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి మెరుగైన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పోలీసులతో మహిళలు, విద్యార్థినిలకు నేరాలు, సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహన కల్పించి చైతన్య వంతులను చేయాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా వుండి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి వుండాలన్నారు. అజ్ఞాత వ్యక్తుల నుండి వచ్చే సంక్షిప్త సమాచారాలు, మెయిల్స్‌లోని లింకులను ఓపెన్ చేయకుండా తిరస్కరించాలని, పొరబాటున లింక్‌పై క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలోని నగదు మొత్తం మాయం అయ్యే అవకాశం వుందన్నారు. ఎవరైనా యాప్‌ద్వారా రుణం ఇస్తామని చెప్పినా తిరస్కరించాలన్నారు. పట్టణాలు, మండల కేంద్రాల్లోని ముఖ్య కూడళ్ళల్లో సిసి కెమెరాలు తప్పక ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా, ఎస్ఇబి ఎఎస్పీ ఎవి సుబ్బారావు, ఏఆర్ ఎఎస్పీ జి.నాగేశ్వరరావు, డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పై ప్రజలకు... అవగాహన కల్పించాలి

**జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు : జిల్లా కలెక్టర్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, జులై 31 ప్రభాతవార్త : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫిరెన్స్ హాల్‌లో పోలీసు, రవాణా, ఇంజనీరింగ్, ఆరోగ్య శాఖ తదితర అధికారులతో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వాహన దారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని తెలిపారు. నాయుడుపేట దగ్గర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చనిపోయారని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఆయా శాఖల వారీగా బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత సమాచారాన్ని హెల్త్ డిపార్ట్మెంట్ వారు ఐ రాడ్ వెబ్సైట్ నందు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. గుడ్ సమా రిటన్ ప్రమాదం జరిగినప్పుడు దగ్గరగా ఉన్న వ్యక్తులు ప్రమాదం జరిగిన గంటలోపు సమాచారం అందించిన, ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టి వ్యక్తి యొక్క ప్రాణాలు కాపాడిన వ్యక్తికి ప్రశంసా పత్రంతో పాటు రూ. 5 వేలు నగదు బహుమానంగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో ప్రమాదకర మలుపుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా రవాణా అధికారి ఆదినారాయణ, పిడి నేషనల్ హైవే తిరుపతి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి, రుయాఆసుపత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

**తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది : జిల్లా కలెక్టర్**



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ , జేసి శుభం బన్సల్, కమిషనర్ నారపురెడ్డి మౌర్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పాలివ్వడం వల్ల తల్లులకు, శిశువులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, తల్లి పాల వల్ల శిశువులకు సరైన పోషకాహారం, రోగనిరోధక శక్తిని పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను మొట్టమొదట 1992లో తల్లిపాలను ప్రోత్సహించడానికి, తల్లి పాల యొక్క ఆవశ్యకత గురించి అవగాహన పెంచడానికి జరుపుకోవడం జరిగిందని, అప్పటి నుండి ప్రతి ఏట వరల్డ్ బ్రెస్ట్ ఫీడింగ్ వీక్‌ను ఆగస్టు 1 నుండి 7 వరకు జరుపుకుంటున్నామని తెలిపారు. తల్లి పాలివ్వడం వల్ల తల్లులకు, శిశువులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, తల్లి పాల వల్ల శిశువులకు సరైన పోషకాహారం, రోగనిరోధక శక్తిని పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలివ్వడం వల్ల కలుగు ప్రయోజనాలను పలు మాధ్యమాలు ద్వారా ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలని అన్నారు. బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలలు తల్లి పాల ఆవశ్యకతను ప్రతి ఒక్కరికి తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యాధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీ హరి, శ్రీనివాస రావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి శాంత కుమారి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కమనీయం...కార్తీకేయుని కళ్యాణం

**-పులకించిన భక్త జనం**



కళ్యాణోత్సవానికి అంబారి వాహనంపై బయలుదేరిన కుమారస్వామి

శ్రీకాళహస్తి,జూలై 31 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత శ్రీవల్లిదేవసేన సమేత కుమారస్వామి వారి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్దంగా కళ్యాణం నిర్వహించిన పాలకులు స్వామి అమ్మవార్లను వదూవరులుగా పట్టణంలో ఊరేగింపు జరిపి దర్శన భాగ్యం కల్పించారు. కళ్యాణం తంతును ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రాలతో కుమారస్వామి తిప్ప పరిసరాలు దద్దరిల్లాయి.బాబూ అగ్రహారం పరిసరాలు పెండ్లి సందడితో కళ కళ లాడింది.విద్యుత్ దీపాల కాంతితో దేదీప్యమానంగా మార్చారు.

**సంప్రదాయాలకు అద్దం పట్టిన కళ్యాణోత్సవం ..**

బుధవారం రాత్రి కార్తికేయుని కళ్యాణోత్సవానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.ఆలయంలోని అలంకార మండపం వద్ద వల్లిదేవసేన సమేత కుమారస్వామిని చక్కగా అలంకరించారు. స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవం సందర్భంగా వల్లిదేవ సమేత సుబ్రమణ్యస్వామిని వాహనాల మండపం వద్దకు తెచ్చి అంబారి వాహనంపై ప్రతిష్టించారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్,సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్,చిన్న ఆలయాల ఇన్‌చార్జి లోకేష్‌రెడ్డి టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు ఇతర ఆలయాధికారులు హాజరుకాగాఆలయ సిబ్బంది వెంట రాగా గ్రామోత్సవం సాగింది. వధువుగా శ్రీవల్లీదేవసేనను అత్యంత సుందరంగా అలంకరించి మండపంలోకి చేర్చారు. వేదపండితులు వేదమంత్రాలు చదువుతుండగా స్వామి వారు అమ్మవార్లకు మాంగల్యధారణ చేశారు. ఈవైభవాన్ని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



# ఇక సిఐలు, ఎస్ఐల వంతు!

**-స్టార్ అధికారులకు బదిలీల గుబులు**

ప్రభాతవార్త-తిరుపతిటౌన్



పోలీస్‌శాఖలో తాజాగా డిఎస్పీల బదిలీలు జరగడంతో ఇప్పుడు తిరుపతి, చిత్తూరుజిల్లాలో సిఐలు, ఎస్ఐల బదిలీలపై రసవత్తరంగా చర్చ మొదలైంది. పోలీసుశాఖ రెండు జిల్లాలుగా విడిపోవడంతో ఆయా జిల్లాల్లో మంచి సర్కిళ్ళలో పోలీసుస్టేషన్‌లలో పోస్టింగ్‌లకోసం పలువురు డబుల్‌స్టార్, త్రిబుల్‌స్టార్ పోలీసు అధికారులు తమతమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాష్ట్రంలో నూతన టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో వైసిపితో అంటకాగిన పోలీసు అధికారులు సిఐలు, ఎస్ఐలను ఇప్పటికే సగంమందిని దూరంగా పెట్టేశారు. ఇప్పుడు ఉన్న అరకొర ఎస్ఐలు, సిఐలు అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు మీరు చెప్పినట్లు చేస్తాం...మాకు మంచి సర్కిల్ ఇప్పించండి... ఫలానా పోలీసు స్టేషన్‌కు బదిలీ చేయండంటూ చక్కర్లు కొడుతున్నారు. తిరుపతి జిల్లా పోలీసుశాఖ పరంగా పాతదైనా కొత్త జిల్లాలో పూర్వపు నెల్లూరు జిల్లాలోని కొన్ని మండలాలు కలిశాయి. దీంతో ఐదారు పోలీసు సర్కిళ్ళు కొత్తగా తిరుపతి జిల్లాలో కలిశాయి, అక్కడ గూడూరు ,శ్రీసిటీ, శ్రీకాళహస్తి, తిరుపతి ఈస్టు, అలిపిరి, ఎంఆర్‌పల్లి, తిరుచానూరు.చంద్రగిరి సర్కిళ్ళలో తమనంటే తమను పోస్టింగ్ ఇప్పించండిఅని కొందరు టిడిపి, జనసేన నేతలకు విజ్ఞప్తి చేసుకొంటున్నారు. దాదాపు సిఐలు, ఎస్ఐలు గత ఎన్నికల సమయంలో నియమితులైనవారే. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా తన సొంత జిల్లా పర్యటనలో పోలీసుశాఖను పూర్తిగాప్రక్షాళన చేస్తానని పార్టీ నేతలు, కార్యకర్తలకు భరోసా కల్పించారు. ఇప్పుడు పోలీసు అధికారుల బదిలీలు జరగడానికి సమయం ఆసన్నమైంది. శని,ఆదివారాల్లో జిల్లాల సిఐలు, ఎస్ఐల బదిలీలు ఉంటాయనేది హాట్‌టాపిక్‌గా మారింది. తిరుపతి సబ్‌డివిజన్‌లో అలిపిరి, ఈస్టు, తిరుచానూరు, వెస్టు, ఎస్వీయూ పోలీసుస్టేషన్‌లకు కొత్త ఎస్ఐలు రానున్నారు. ప్రస్తుతం ఆయా స్టేషన్‌లలో ఉన్న ఎస్ఐల పనితీరుపై పలు విమర్శలు, ఆరోపణలు వున్నాయి. చిత్తూరుజిల్లాలో దాదాపు ఇదే పరిస్థితి ఉంది. చాలావరకు సిఐలు, ఎస్ఐలు తమకు మంచి స్టేషన్‌లలో పోస్టింగ్‌లు ఇప్పించాలని అధికార పార్టీనేతల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు మాత్రం ముఖ్యమంత్రి సొంత జిల్లాలో శాంతిభద్రతలు, భూవివాదాలు తలెత్తకుండా చూసే మంచి అధికారులను కొంచెం సీనియార్టీ మేరకు నియమించే అవకాశం ఉంది.

# పేరూరులో కాల్వ పోరంబోకు స్థలం... కబ్జాకు యత్నం!

**-పట్టపగలే జెసిబిలతో కాల్వ పూడ్చివేత -పట్టించుకుని రెవెన్యూ అధికారులు**



కబ్జాకు గురైతున్న భూమి

తిరుపతిరూరల్, జూలై 31 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ పేరూరు గ్రామ పంచాయతీలో ప్రభుత్వ భూమి యదేచ్ఛగా కబ్జాకు గురైతున్నా...రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తూ... కబ్జా రాయుళ్ళకు కొమ్ముగాస్తు న్నారనే ఆరోఫణలు బలంగా వినిపిస్తున్నాయి. కనబడిన కాల్వలు, చెరువు పోరంబోకు, కశంకాల్వలు, డికెటి,ఎడబ్ల్యుడి తదితర భూములు అన్యాక్రాంత మైతున్నాయి. తాజాగా పేరూరు గ్రామ పంచాయతీలో వున్న సర్వేనెంబర్ 460, 460/2 సర్వేనెంబర్‌లో ఉన్న ప్రభుత్వభూమి అన్యాక్రాంతమైతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. కోట్ల రుపాయాలు విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైతున్న రెవెన్యూ అధికారులు ఉదాసీనతగా వ్యవహరించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**హెచ్చరిక బోర్డు తొలగింపు :**

పేరూరు గ్రామ లెక్కదాఖల సర్వేనెంబర్ 460లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును కూడా కబ్జారాయుళ్ళు తొలగించి, యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.

# కుప్పంలో తెరుచుకున్న టిడిపి తలుపులు

**-చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరిన కౌన్సిలర్లు...ఎంపిటిసిలు**



చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరుతున్న వైకాపా కౌన్సిలర్లు

కుప్పం, జూలై 31 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తలుపులు తెరుచుకున్నాయి. కుప్పం మున్సిపాలిటీకి చెందిన ఐదుమంది వైఎస్సార్సీ కౌన్సిలర్లు, నియోజవర్గానికి చెందిన పద్నాలుగు మంది ఎంపిటిసిలు బుధవారం ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ నేతృత్వంలో ఉండవల్లిలోని సిఎం చంద్రబాబు నాయుడు నివాసం వద్ద ముఖ్యమంత్రి సమక్షంలో వీరు తెలుగుదేశం పార్టీలో చేరారు. తెదేపాలో చేరిన వారిలో కుప్పం మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు జగన్, సయ్యద్ అలీ, ఎంఆర్ సురేష్, సోమశేఖర్, కమతమూరు రవిలు ఉన్నారు. వీరిని సిఎం చంద్రబాబునాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే కుప్పం మండలంకు చెందిన వైఎస్సార్సీ ఎంపిటిసిలు తిమ్మరాయన్, శ్రీనాథ్, వెంకటేష్, గుడుపల్లె మండలానికి చెందిన నారాయణసా ్వమి, వెంకటేశ్వరమ్మ, శ్రీకాంత్, వెంకటేష్, రాజేశ్వరి, సంపంగి, శాంతిపురం మండలానికి చెందిన ఉమాదేవి శేఖర్, వనిత సుబ్రమణ్యం, రవికుమార్, చంద్రప్ప, బిఎన్ వెంకటేష్ తదితర పద్నాలుగు మంది మండల పరిషత్ సభ్యులు సిఎం చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరారు.కాగా వైఎస్సార్సీ పార్టీలో తమకు తగిన గుర్తింపు లేదని, పట్టించుకునేవారు కరువయ్యారని తెదేపాలో చేరిన ఎంపిటిసిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, సమన్వయకమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, విశ్వనాథ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ప్రతాప్, రవి,రామచంద్ర, జిల్లా నేత రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**ముమ్మందు మరిన్ని చేరికలు :**

కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్సీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసలు ముమ్మందు మరింత ఊపందుకోనున్నాయని తెలుస్తోంది. విడతల వారీగా వైకాపాకు చెందిన మరింతమంది ఎంపిటిసిలు, సర్పంచులు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు అతి త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సుముఖత చూపుతున్నారు. కుప్పం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల నాటికి వైఎస్సార్సీ ఉనికి ప్రశ్నార్థకంగా మారేలా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు అధికార తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# నామినేటెడ్ పదవులపై... బీసిల ఎదురుచూపు!



శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బిసిల జనాభా అత్యధికంగా ఉంది. ఆది నుంచి తెలుగుదేశం పార్టీకి బిసిలు పట్టుగొమ్మల్లా ఉంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఓ సామాజిక వర్గానికి చెందిన బిసిలు సుమారు 40వేల మంది ఉన్నారు. ఇక ఇతర సామాజిక వర్గాల బిసిలు పార్టీ ఆది నుంచి ఉంటూ ఎలాంటి వత్తిడులు ఎదురైనా ఎదుర్కొం టున్నారు. అంతేకాక పలువురు పోలీసు కేసుల్లో ఇరుక్కొని కోర్టుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. నియోజక వర్గంలోనూ, పట్టణంలోనూ పలువురు బిసిలు పార్టీకి వెన్ను ముకలుగా ఉన్నారు. ఐదేళ్ళ పాటు గతంలో పరిపాలించిన పార్టీ బిసిలకు పెద్దపీట అని కొందరికి అందలం ఎక్కించారు. అయితే ఆది నుంచి నిరుపేదలు, మధ్యతరగతి బిసిలకు తెలుగుదేశం పార్టీలో ప్రాధాన్యత అని చెబుతున్నారు. అంతేకాదు గతంలో మున్సిపాలిటి పరిపాలన బాధ్యతను ఓ సామాజిక వర్గానికి చెందిన నాయకునికి జనరల్ స్థానంను పట్టం కట్టారు. బిసికి చెందిన పేట రాధారెడ్డిని చైర్మెన్ చేయటానికి గతంలో పరిపాలించిన మంత్రి గోపాలకృష్ణారెడ్డి జనరల్ స్థానంలో కూర్చొబెట్టి తాను బిసిలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నానో నిరూపించుకున్నారు. అంతేకాక అదే సామాజిక వర్గానికి చెందిన యువకుడు మిన్నల్ రవిని మున్సిపల్ వైస్ చైర్మెన్ చేసారు. ఇక మరో బిసి నాయకుడు గుమ్మడి దశరధాచ్చారికి పార్టీ పదవులలో రాష్ట్రస్థాయి కార్యదర్శి పగ్గాలు అందించారు. ఇక నియోజకవర్గంలోని మరో నాయకుడు రెడ్డివారి గురువారెడ్డికి రాష్ట్రస్థాయి కార్యదర్శి పదవులను కట్టబెట్టారు.

**ఊహల పల్లకిల్లో బిసిలు:**

శ్రీకాళహస్తికి చెందిన పలువురు బిసి వర్గాలకు చెందిన నాయకకులు ప్రస్తుత తెలుగుదేశం పాలనలో తమకు సముచిత స్థానం గుర్తింపు నామినేటెడ్ పదవుల పందారంలో గుర్తింపు ఉంటుందని ఆశల పల్లకిలో విహరిస్తున్నారు. అయితే ఇక్కడ ముఖ్యంగా నామినేటెడ్ పదవుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం, వ్యవసాయ మార్కెట్ కమిటి మాత్రమే ఉన్నాయి. ఇవి కాక కోఆపరేటివ్ విభాగంలో పాలసరఫరా సంఘం, టౌన్‌బ్యాంకులున్నాయి. వీటిలో అవకాశం వస్తుందని పలువురు ఆశిస్తున్నారు.ఇక పట్టణంలో తెలుగుదేశం పార్టీకి ఆది నుంచి వెన్నుదన్నుగా పలువురు ఉన్నారు. వారిలో ఉమేష్‌రావు ఆయన సతీమణి నివేదిత మోరే విద్యావంతురాలు. ఒక సారి కౌన్సిలర్‌గా సమర్ధవంతంగా విధులు నిర్వహించారు.శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యురాలుగా సమర్ధవంతంగా పని చేసిన బూడివాకం రేణుకమ్మ బిసి సామాజిక వర్గానికి చెందిన ఆమె. ఇక మరో యువకుడు సెవెన్ స్టార్ శ్రీనివాసులు, సుమారు 30 సంవత్సరాలుగా పార్టీలో ఉంటూ ఎలాంటి నామినేటెడ్ పదవులను ఆశించలేదు. మరో యువకుడు నెమళ్ళూరు బుజ్జి గాండ్ల సామాజికవర్గానికి చెందిన వ్యక్తి గత 20ఏళ్ళపై నుంచి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి అనుంగ అనుచరుడుగా ఉన్నారు. ఇలా పార్టీ కోసం పాటు పడిన బిసిలు ఎంతో మంది రాబోవు నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం దక్కుతుందేమో అని ఆశపడు తున్నారు. వివిధ సమీకరణలో శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పార్టీ కోసం పాటుపడుతూ తమతో పాటు నడుస్తున్న వారికి సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతో సమీకరించుకుంటున్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన హరిణిరెడ్డి



**చిత్తూరు, జూలై 31 ప్రభాతవార్త:** వైకాపా నాయకురాలు కట్టమంచి హరిణిరెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వైకాపా అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం వైఎస్‌జగన్మోహన్‌రెడ్డిహరిణిరెడ్డితో మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్యపడవద్దని, వారికి పార్టీ అండగా వుంటుందని, అందరు కలిసికట్టుగా ముందుకు వెళ్ళాల్సి వుంటుందన్నారు.

## వదలని సారాయి మత్తు

### – రోడ్డు ప్రక్కన చెట్లలో పడిన సారాయి ప్రియుడు

**శ్రీరంగరాజపురం, జూలై 31 ప్రభాతవార్త:** ఇక్కడ కన్పిస్తున్న ఫోటో చూస్తే ప్రమాదవశాత్తు ఎవరో కాలువలో పడి మృతి చెందారని అందరు అనుకుంటాం. అయితే అదేమి కాదు శ్రీరంగరాజపురం మండల పరిధిలోని పూత్తూరు రోడ్డు ప్రక్కన ఫుల్లుగా సారాయి తాగి మత్తులో పడి వున్న ఓ సారాయి ప్రియుడి చిత్రం ఇది. మండల పరిధిలోని కొత్తపల్లిమిట్ట నుండి మండల కేంద్రం వరకు అనునిత్యం ఇలాంటి సంఘటనలు మాములుగా కన్పిస్తుంటాయి. ప్రక్కనే తమిళనాడు రాష్ట్రం వుండటం అక్కడ నాటు సారా సమృద్ధిగా లభ్యమవుతుండటంతో సారా ప్రియులు అడుగులు వేసుకుంటూ వెళ్ళి సారాయి ఫుల్లుగా సేవించి ఇలా పడిపోవడం సాధారణమైంది. సారాయి కట్టడికి అధికారులు దృష్టి పెట్టకుంటే ఇలాంటి సంఘటనలు ఎక్కువ అయ్యే అవకాశాలు వుంటాయి.

## యాదవ్ నివాసంలో హోమాలు



**పుంగనూరు, జూలై 31 ప్రభాతవార్త :** బిసివై నాయకుడు బోడే రామచంద్ర యాదవ్ నివాసంలో బుధవారం ఆడికృత్తిక సందర్భంగా శ్రీవారాహీమాత, శ్రీచండికా హోమ కార్యక్రమాలు,పూజలు వైభవంగా నిర్వహించారు. కృత్తికతో పాటూ కామిక ఏకాదశి సందర్భంగా బుధవారం ఉదయం నుంచి వారి ఇంటి ఆవరణలో వివిధ పుణ్యక్షేత్రముల నుంచి రప్పించిన వేదపండితులతో హోమాలు నిర్వహించారు. శ్రీవారాహీమాతకు,శ్రీచండికామాతలకు నిర్వహించిన అపూర్వ హోమాలకు పట్టణ,గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు భక్తులు పాల్గొన్నారు. బోడే రామచంద్రయాదవ్, సునంద దంపతులతో పాటూ వారిపిల్లలు, కుటుంబసభ్యులు, బిసివై అగ్రనాయకులు చనకంటి సాంబమూర్తి, హరినాథరెడ్డి, అనిల్‌కుమార్‌కైలాసంరెడ్డిలుపాల్గొన్నారు.అమ్మలకరుణఈనియోజకవర్గంపై ఉండాలని ప్రార్థించామన్నారు.

## సేవలు పట్టణవీధులు పరిశుభ్రం కోసం అంకితం

**పుంగనూరు, జూలై 31 ప్రభాతవార్త :**



పట్టణంలోని అన్ని ప్రాంతాలనూ చీపురుపట్టి పరిశుభ్రం చేయడానికి ఆమె తన 37 ఏడేళ్ల ఉద్యోగ జీవితాన్ని అమృతప్రాయంగా నిర్వర్తించింది. 62 ఏళ్ళ ముదిమి వయసులో కూడా ఇంకా నేను పనిచేస్తాను సారూ నాకు పదవీ విరమణ వద్దంటూ ఆమె అధికా రులను ప్రాధేయపడడం అందర్నీ ఆశ్చర్యచకితులు చేసింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని తూర్పు మొగసాలకు చెందిన రెడ్డెమ్మ పారిశుద్య కార్మికురాలుగా అందరికీ పరిచయం. ఈవాడ, ఈవార్డు, ఈసందు, ఈవీధి అంటూ ఏమీలేదు. అన్ని ప్రాంతాలను ఆమె చీపురుపట్టి శుభ్రంచేసింది. మున్సిపల్ మేస్త్రీలు ఆరోజు ఆమెకు ఏ ప్రాంతంలో డ్యూటీ వేస్తారో, ఆ ప్రాంతంలో ఆమె చకచకా తన విధులు నిర్వర్తించేది. బుధవారం ఆమె పదవీ విరమణ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ నర్సింహప్రసాద్ ఆమెను శాలువతో సత్కరించి అభినందించారు. ఆమెను పారిశుధ్య కార్మికులు సత్కరించారు. తనకు అవకాశమిస్తే మరింత కాలం పనిచేస్తానని ఆమె అధికారులను కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



**కుప్పం, జూలై 31 ప్రభాతవార్త :** కుప్పం నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం 10గంటలనుంచే నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో కలెక్టరుకు అందజేశారు. రెవెన్యూకు సంబంధించి 53, ఆర్డీఓ 9, హౌసింగ్ 6, వెటర్నరీ 4, బిసి కార్పోరేషన్ 2, ద్రవిడ వర్సిటీ 2వంతున మొత్తం 83 అర్జీలు కలెక్టరుకు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలనుంచి అందిన వినతులను ఆయా శాఖల వారీగా అధికారులకు అందించడం జరుగుతుందని సాధ్యమైనంత త్వరగా వాటి పరిష్కారంకు చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్డీఓ శ్రీనివాసులు, కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### –జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసమూర్తి

**తవణంపల్లె, జూలై 31 ప్రభాతవార్త:** జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని మల్లకుంట సచివాలయ పరిధిలోని స్వస్తిక్ నగర్‌లో గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ టిఎస్.మోహన్‌వేలులు సుమారు 96 మందికి వివిధ రకాల జబ్బులకు వైద్యపరీక్షలు నిర వ్హించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సీడీపీఓ జి.నిర్మల, సీహెచ్ఓ రాజామణి హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, రెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు టి,సుబ్రమణ్యంరెడ్డి, చాముండేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

**ఐరాలలో...**

మండలంలోని గోవిందరెడ్డిపల్లె ఎస్టీ కాలనీలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిభిరం, ఆధార్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ బాల్య వివాహాలు, దుష్పరిమాణాలు, గిరిజన పాఠశాలలు, గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సీడీపీఓ నిర్మల, టీడీపీ నాయకులు రంజిత్‌రెడ్డి, బిజెపీ రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి ఆదినారాయణ, మండల పూర్వ అధ్యక్షుడు అయిరాల రాజేష్‌రెడ్డి, గిరిజన శాఖ అధికారులు మురళీకృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో ద్వారకా తిరుమల ఈఓ



**కాణిపాకం, జూలై 31 ప్రభాతవార్త:** ద్వారకా తిరుమల దేవస్థానం ఈఓ త్రినాధరావు బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్ వాసు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు.ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విఘ్నేష్, రవి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 3న డిఇఓ కార్యాలయం ఎదుట ధర్నా

### – డిఇఓకు నోటీసులు ఇచ్చిన ఎస్టీయు నాయకులు

**చిత్తూరు, జూలై 31 ప్రభాతవార్త:** జిల్లా విద్యాశాఖలో పదోన్నతి పొందిన కొంతమంది ఉపాధ్యాయులు తమకు పదోన్నతి వద్దని తమను పాత పోస్టులకే రివర్షన్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి దరఖాస్తు చేసుకుని ఏడాది నుండి డిఇఓ కార్యాలయం చుట్టూ ప్రదిక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో ఆగస్టు 3న డిఇఓ కార్యాలయం ఎదుట ధర్నాకు పిలుపు ఇస్తున్నట్లు రాష్ట్ర ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్, జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోడె మోహన్‌యాదవ్ తదితరులు డిఇఓను కలిసి ధర్నా నోటీసులు అందజేశారు.

## నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

**చిత్తూరు, జూలై 31 ప్రభాతవార్త:** చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు గురువారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు మున్సిపలల్ కార్పొరేషన్ కార్యాలయంలో చిత్తూరు మున్సిపల్ కమీషనర్, చిత్తూరు రూరల్, గుడిపాల మండల అధికారులతో కలిసి డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చును. ప్రజలు సమస్యలపై 98499 07885 నెంబర్‌కు డయల్ చేయాల్సి వుంటుంది.

## ఎలక్ట్రిక్ వాహనాలతోనే పర్యావరణ పరిరక్షణ

### – ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

**చిత్తూరు, జూలై 31 ప్రభాతవార్త:** ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాలు పెద్ద ఎత్తున వినియోగించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఎడిఎంఎస్ ఈబైక్స్ సంస్థ ఆద్వర్యలో చిత్తూరులో బుధవారం నిర్వహించిన ఈ–బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఈ–బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ బైక్ ర్యాలీ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుండి నగరం మొత్తం తిరుగుతూ ఎన్‌పి సావిత్రమ్మ డిగ్రీ కళాశాల వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ నగర పరిధిలోని ప్రజలు కాలుష్య రహిత సమాజ ఆవిష్కరణ కోసం ఇ–బైక్‌లు విస్తృతంగా వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఈ–బైక్స్ కల్గిన వాహనదారులు, ఈ–బైక్ కంపెనీల మేనేజర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే ప్రజల్లో నిలుస్తారు



**చౌడేపల్లి, జూలై 31 ప్రభాతవార్త :** ఉద్యోగులు బాధ్యతలను భారంగా కాకుండా బంధాలుగా సేవలం దిస్తే ప్రజల గుండెల్లో స్థిరంగా నిలచిపోతారని తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి), యువనేత మాదిరాజు ప్రదీప్‌రాజుల న్నారు. ఎంపిడిఓ శివప్రసాద్ పవదీ విరమణ సందర్భంగా స్థానిక మండల పరిపాలనా భవనంలో ఆయనకు సన్మాన మహోత్సవ సభను ఏర్పాటు చేసారు. అనంతరం ఎంపిడిఓ దంపతులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. తేదేపా నాయకులు ఆవుల రామచంద్రయ్య, శ్రీధర్‌రాజు(గిరి), పంజానిపల్లి బాబు నాయుడు, బోయకొండ సుబ్బు, విజయభాస్కర్‌రెడ్డి, చిన్నికృష్ణ, భాస్కర్‌రెడ్డి, ఇఓఆర్డీ కృష్ణవేణి, ఎంఇఓలుకేశవరెడ్డి,తిరుమలమ్మ,మండలంలోనిఅన్నిశాఖలఅధికారులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సొంతింటికే నిప్పంటిచుకొన్న ఘనుడు!



**చౌడేపల్లి, జూలై 31 ప్రభాతవార్త :** మండలంలోని కాటిపేరి పంచాయతీ గిరిజాపురంలో ఓ ఘనుడు సొంతింటికే నిప్పంటిచుకోగా రూ. 4లక్షల ఆస్థినష్టం వాటిల్లింది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కథనం మేరకు... గిరిజాపురంకు చెందిన ముత్తయ్యకు గ్రామంలో అద్దపిళ్ళు వుంది. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఇంటి యజమాని ముత్తయ్య మద్యం సేవించి తాగిన మైకంలో సొంతింటికే నిప్పు పెట్టుకొన్నాడని తెలిపారు. గుర్తించి చుట్టుపక్కల వారు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. పుంగనూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేసారు. ఈప్రమాదంలో ఇంట్లో వున్న బంగారం, విలువైన వస్తువులు కాలిబూడిదయి రూ. 4లక్షల వరకు ఆస్థినష్టం వాటిల్లిందని సుబ్బరాజు వివరించారు.

## ఉమ్మడి వనరులను సంరక్షిద్దా



**చౌడేపల్లి, జూలై 31 ప్రభాతవార్త :** ఉమ్మడి వనరులను సంరక్షిద్దామని ఉపాధి ఎపిఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక ఐకెపి భవనంలో ఉమ్మడి వనరుల అభివృద్ధి సమావేశం జరిగింది. ఉమ్మడి వనరుల పునరుద్దరణకు ఉపాధిహామీ పథకం వరమన్నారు. రైతులు పొలాలు, కొండలు, చెరువులు, పశుమేత భూముల్లో పశుగ్రాసాన్ని పెంచి కోతలను అరికట్టడంతోపాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలన్నారు. రైతులు పశుగ్రాసానికి ముందుకు వస్తే ఎకరాకు రూ. 97వేల వరకు ఉపాధిహామీ పథకం ద్వారా అందిస్తామన్నారు. గతంలో మామిడి మొక్కలు పెట్టుకొన్న రైతులు అనర్హులన్నారు. ఆసక్తిగల రైతులు జాబ్‌కార్డు, భూమి పాసుపుస్తకంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించా లన్నారు. అనంతరం ఉమ్మడి వనరుల సంరక్షణపై రైతులకు శిక్షణలిచ్చారు. కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్, కో–ఆర్డినేటర్ హసీనా, పశువైద్యాధికారి పవన్, శిక్షకుడు తల్లా శ్రీనివాసులు, జేఈ ధనుంజయుడు, సాంకేతిక నిపుణులు, రైతులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న తిథిభోజనం



**తవణంపల్లె, జూలై 31 ప్రభాతవార్త:** మండలంలోని అరగొండ జడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో టీడీపీ నాయకులు బుధవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న తిథిభోజనం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సౌకర్యార్థం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న విషయం విధితమే. ఈనేపథ్యంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు అరగొండకు చెందిన టీడీపీ నాయకులు ఎ.రఘుపతి తిథి భోజనంను ఏర్పాటు చేసి కోడిగుడ్డు, పాయసం, అరటిపండులను అందించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు రంజిత్‌రెడ్డి, శివకుమార్, పైమాఘం గాంధీ, గోపీ యాదవ్‌లతో పాటు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఎమ్మెల్యే రామకృష్ణ



**వెంకటగిరి, జూలై 31 ప్రభాతవార్త :** మున్సిపల్ కార్యాలయంలో ఎక్స్ అపిషియే సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కమిషనర్ అబ్దుల్ నజీర్ ఎమ్మెల్యే చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యేగా నూతనంగా విజయం సాధించడంతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అఫీషియో నెంబర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను చైర్ పర్సన్ నక్క భానుప్రియ, వైస్ చైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు ఘనంగా స్వాగతం పలికారు.

## ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణం సురక్షితం : ఎమ్మెల్యే



**వెంకటగిరి, జూలై 31 ప్రభాతవార్త :** ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి ఆర్టీసీ డిపోలో బెంగళూరుకు కొత్తగా నడిపే రెండు బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆటోలు తదితర వాహనాల్లో దూర ప్రాంతాలకు వెళ్ళరాదని సూచించారు. ఆర్టీసి సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. చెన్నై కూడా త్వరలో బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. రిబ్బన్ కట్ చేసి బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## దంతాలు శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవు



**వెంకటగిరి, జూలై 31 ప్రభాతవార్త :** దంతాలు రోజుకి రెండుసార్లు శుభ్రపరచడం వలన క్యాన్సర్ లాంటి రోగాలు దూరం చేసుకోవచ్చునని దంత వైద్యులు డాక్టర్ చల్లా సుమన్ తెలిపారు. స్థానిక వల్లివేడులోని కస్తురిభా కళాశాలలో సింహపూరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. ఈ శిబిరంలో దంత వైద్యులు సుమన్ దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యులు కుంచమ్ కావ్య, కుంచమ్ స్వప్న పాల్గొని కళ్ల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గుడిమెట్ల ఉదయ్ కుమార్, కార్యదర్శి పోచినేని ప్రవీణ్ కుమార్, విష్ణు వర్ధన్, సాయి నీకేష్, సాయి చరణ్, హాస్టల్ వైద్యులు గిరిజ, దంత వైద్యులు లీలా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రామిక్ నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి: సిపిఎం



**గూడూరు, జూలై 31 ప్రభాతవార్త :** గూడూరు పట్టణంలోని శ్రామిక్ నగర్‌లో మౌళిక వసతులు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు రెండో పట్టణంలోని శ్రామిక్ నగర్‌లో నివాసం ఉంటున్న స్థానికులు, సిపిఎం నాయకులతో కలిసి బుధవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జోగి శివకుమార్ మాట్లాడుతూ ఇటీవల ఈ ప్రాంతంలో రోడ్లు కాలువలు వేశారని ఓ ప్రైవేటు కాలేజీ వారు, కాలువ పై గోడ నిర్మించడంతో మురుగునీరు పోక ఇబ్బందులు పడుతున్నామని సమస్యను పరిష్కరించాలని కోరార్లు, సిఐటియు నియోజకవర్గ నాయకులు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి సురేష్, బివి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి



**కోట, జూలై 31 ప్రభాతవార్త :** గూడూరు డివిజన్ వైసీపీ యువత విభాగం అధ్యక్షుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లపాటు గూడూరు నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి సాయిప్రసాద్‌రెడ్డి కృషి చేసినట్లు జగన్‌కు వివరించారు.

## అభివృద్ధికి అందరి సహకారం అందించండి : ఎమ్మెల్యే



**సూళ్లూరుపేట, జూలై 31 ప్రభాతవార్త :** సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతిఒక్కరు సహకారం అందించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. మున్సిపాలిటీ ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ సూళ్లూరుపేట పట్టణాన్ని రాష్ట్రంలోని మంచి పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. రోడ్లు, డ్రైనేజి, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఇందుకు తగ్గట్టుగా మున్సిపల్ పాలకవర్గం తనకు సహకరిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తామన్నారు. సూళ్లూరుపేట పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు గత టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు రూ.140 కోట్ల మంచినీటి పథకం గత వైసీపీ ప్రభుత్వం మూలనపడిపోయిందని చెప్పారు. ఈ పథకాన్ని పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తానని విజయశ్రీ చెప్పారు. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో పనిచేస్తున్న అధికారులు, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నేతలు అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీ కార్యాలయంపై రూ.45 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అదనపు భవనాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, చిట్టేటి పెరుమాళ్లు, మాధవనాయుడు, వైస్ ఛైర్మన్ చిన్ని సత్యం, పోలూరు పద్మ, కౌన్సిలర్లు పముజుల విజయలక్ష్మి, జానకిరాం, మునిప్రసాద్, సౌజన్య, మీజూరు రామకృష్ణారెడ్డి, కమిషనర్ సిహెచ్ గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భ్రమల్లో నుంచి బయటకు రండి

### – వైసీపీ నేతలకు నెలవల హితవు



**సూళ్లూరుపేట, జూలై 31 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఘోర పరాజయం పాలై ప్రజలచే తిరస్కరించబడిన వైసీపీ నాయకులు తాము ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలతో కాలం వెళ్లదీస్తున్నారని, ఇప్పటికైనా భ్రమలో నుంచి బయటకు రావాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం వైసీపీ నేతలకు హితవు పలికారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలుగుదేశం ప్రభుత్వాన్ని, చంద్రబాబును విమర్శించడం సరికాదని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు అమలు చేయలేడనే ఆయనే స్వయంగా ప్రకటించాడని కిలివేటి సంజీవయ్య పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ అజెండా అభివృద్ధి మాత్రమే అని, లేనిపోని రాజకీయ కక్షలకు తాము వ్యతిరేకమని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, షేక్ రఫీ, మాధవనాయుడు, చిట్టేటి పెరుమాళ్లు, ఎజి కిషోర్, దంతాల రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి సిబ్బందితో ఎంపిడిఓ సమావేశం



**తడ, జూలై 31 ప్రభాతవార్త :** తడ మండలంలోని ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం ఎంపిడిఓ ఎన్.విజయకుమార్ సమావేశం జరిపారు. ఉపాధి కూలీలకు కనీసం రూ.300 వేతనం వచ్చేలాగా ఇటీవల పనులు చేయాలని సూచించిన ఎంపిడిఓ బుధవారం ఆ మేరకు జరుగుతున్న పనులను విచారించారు.బిల్లులు త్వరగా పెట్టాలని, ఎప్పటికప్పుడు ఉపాధి కూలీలను పెంచేలాగా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. తడ మండలం తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో మంచినీటి సమస్య ఏర్పడినట్లు ఆ కాలనీ వాసులు బుధవారం ఎంపిడిఓకు ఫిర్యాదు చేశారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లతో ఎంపిడిఓ మాట్లాడారు.ఈ సమస్యకు రెండు మూడురోజుల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై బుధవారం మరోసారి అధికారులు సమావేశమయ్యారు. వాట్సాప్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలని, సమాచారం పింఛన్‌దారులకు ఖచ్చితంగా అందాలన్నారు.

## ఇంటింటికి పెన్షన్లు పంపిణీ చేయాలి

### – గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



**గూడూరు, జూలై 31, ప్రభాతవార్త :** ఇంటింటికి వెళ్లి పెన్షన్‌ను ఇవ్వాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అధికారులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గూడూరు పట్టణంలోని టిడిపి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం పెన్షన్‌ను పెంచి లబ్ధిదారులకు ఇంటి వద్దనే పెన్షన్ ఇచ్చిన ఘనత సిఎం చంద్రబాబుకి దక్కుతువందన్నారు. అధికారులు, అదే విధంగా గూడూరు పట్టణంలో ఆగస్టు 15వ తేదిన పేద వాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు. పెన్షన్ పంపిణీలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అక్రమంగా లేఔట్‌లో వేయడం జరిగిందని వాటిని పూర్తి స్థాయిలో విచారణ చేపడతామన్నారు. అదే విధంగా అక్రమంగా తీర ప్రాంత గ్రామాల్లో కోట్లలో సిలికా సంపద దోచుకోవడం వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం దారుణం అన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కల్పించేందుకు రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, టిడిపి నాయకులు చాన్ భాషా, వాటంబెడు శివకుమార్, బిల్లు చెంచు రామయ్య, వెంకటేశ్వర రాజు, తదితరులు పాల్గొన్నారు.

## గూడలిలో పౌరహక్కుల దినోత్సవం



**కోట, జూలై 31 ప్రభాతవార్త :** కోట మండలం గూడలి పంచాయతీలోని కొండకింద గిరిజన కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు రవీంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం రూపొందించిన ప్రాథమిక హక్కులను, విధులను వివరించారు.పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ విజయసారధిరెడ్డి, ఇఓ పిఆర్‌డి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు వైవి కమలమ్మ, సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో ప్రశాంతంగా ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు



**కోట, జూలై 31 ప్రభాతవార్త :** కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) డిపార్ట్‌మెంట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 50 మంది హాజరు కావలసి ఉండగా 42 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాన్ని ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ మల్లికార్జునరావు పర్యవేక్షించారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించారు.

## మహిళ కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు

**దొరవారిసత్రం జూలై 31 ప్రభాతవార్త ;** మండలంలోని వేణుబాక గ్రామానికి చెందిన భవాని కనిపించడంలేదని ఆమె భర్త ప్రసాద్ బుధవారం పోలీసులకు పిర్యాదు చేశారు.గత మూడు రోజుల నుండి ఆమె కనిపించకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో బంధువుల దగ్గర విచారించిన ఆమె ఆసూకి తెలియడం లేదని పోలసులకు తెలియజేశారు. దొరవారిసత్రం పోలీసులు మహిళ మిసి ్సంగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హెల్మెట్ పై అవగాహన



**గూడూరు, జూలై 31 ప్రభాతవార్త :** ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గూడూరు రూరల్ సిఐ వేణుగోపాల్ రెడ్డి, రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం గూడూరు రూరల్ పరిధిలోని పోటుపాలెం కూడలి వద్ద వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహన దారులు మరణిస్తున్నారని చాలా బాధాకరం అన్నారు. ప్రధానంగా హెల్మెట్ ధరించకపోవడం వలన మరణిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను ధరించాలని తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పాఠశాల దశ నుంచి నాయకత్వ లక్షణాలు



**తిరుపతి విద్య, జులై 31 ప్రభాతవార్త** : స్థానిక మంగళంలో ఉన్న నారాయణ పాఠశాలలో అధిష్టాన సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఏజిఎం కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, దేశ భవిష్యత్తు బాల బాలికల చేతుల్లోనే ఉన్నది అని తెలియజేసి, పిల్లల ఎన్నికల ఫలితాలని వెల్లడించారు. తరువాత ఆర్ఐ వసంత కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమస్యలపై ప్రశ్నించే తత్వాన్ని, క్రమశిక్షణ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హంసవేణి, అకడమిక్ డీన్ వెంకటేష్, ఆర్ఎస్‌టి ఇన్చార్జి సాయి కృష్ణ, నావాజ్, వైస్ ప్రిన్సిపాల్ సుప్రియ, ఏవో మునికుమార్, ఉపాధ్యాయులు బృందం తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ఈవోను కలిసిన ఎస్వీయూ ఉన్నతాధికారులు



**తిరుపతి విద్య, జులై 31 ప్రభాతవార్త** : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతనంగా నియమితులైన ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తిరుమల తిరుపతి దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి జె. శ్యామల రావును బుధవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గతంలో ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా శ్యామల రావు ఉన్నప్పుడు ఎస్వీయూతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఎస్వీయూ అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని ఈవో వెల్లడించినట్లు తెలిపారు.

## బయోటెక్నాలజీలో భార్గవకు డాక్టరేట్ ప్రధానం



**తిరుపతి విద్య, జులై 31 ప్రభాతవార్త** : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగపు పరిశోధన విద్యార్థి యలకంబేడు భార్గవ్‌కు వర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డామ్లా నాయక్ తెలిపారు. ఆచార్య జెవిఎస్ఆర్ మూర్తి మార్గదర్శకత్వంలో ఐసోలేషన్, క్యారక్టరైజేషన్ ఆఫ్ సింబయాటిక్ నైట్రోజన్ ఫిక్సింగ్ బాక్టీరియా ఫ్రం వైల్డ్ లెగ్యూమ్స్ టు ఎన్హెన్స్ క్రాప్ ప్రొడక్టివిటీ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. చంద్రగిరి మండలంలోని నరసింగాపురంకి చెందిన వై. పార్ధసారథి ఆచారి వై. సుగుణమ్మ దంపతుల కుమారుడు వై. భార్గవ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లలో అనేక పరిశోధన వ్యాసాలను ప్రచురించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా భార్గవ్‌కు డాక్టరేట్ డిగ్రీఅవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## కవితకు ఉత్తమ సామాజిక చైతన్య పురస్కారం



**తిరుపతి విద్య, జులై 31 ప్రభాతవార్త** : శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటీ తిరుపతి జిల్లాకు చెందిన డా. పి. తవితా తులసి, హెడ్, డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ వారు శ్రీశ్రీ కళా వేదిక, పిఠాపురం రాజా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో గోదావరి కవితోత్సవంలో 137వ జాతీయ శతాధికవి సమ్మేళనంలో డా. తవితా తులసి వ్రాసిన సాహస జీవితం అలనే కవితకు ఉత్తమ సామాజిక చైతన్యంతో కవిత్వం రాసినందుకు ఈ అవార్డును నిమ్మకాయల చినరాజప్ప శాసన సభ్యులు, మాజీ మంత్రి పెద్దాపురం, కత్తిమండ ప్రతాప్, అంతర్జాతీయ చైర్మన్ శ్రీశ్రీ కలావేదిక వారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి!



**శాంతిపురం, జులై 31 ప్రభాతవార్త** : మండలంలోని గుండిశెట్టిపల్లి సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడ్డ గుర్తుతెలియని వ్యక్తిని స్థానికులు చికిత్స నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గజ దొంగలను పట్టుకున్న సిఐకు ప్రశంసా పత్రం



**గంగవరం, జులై 31, ప్రభాతవార్త** :పందులు కనిపిస్తే చాలు వెంటనే ఒడిసి పట్టి ఆపై గంటల వ్యధిలోనే కేజీల లెక్కన మాంసం విక్రయించే అంతరాష్ట్ర పందుల దొంగల ముఠా గుట్టు రట్టు చేసి కేసును చేధించిన నేపథ్యంలో గంగవరం అర్బన్ సిఐ చిన్నగోవిందును జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.బుధవారం చిత్తూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇటీవల సిఐ చిన్నగోవింద అనంతపురం జిల్లాకు చెందిన ముఠా అంతరాష్ట్ర స్థాయిలో పందులను దొంగలించి గుట్టుగా విక్రయిస్తున్న ముఠాను పట్టుకుని భారీ ఎత్తున నగదును స్వాధీనం చేసుకుని కేసును చేధించిన సందర్భంగా ఆయనకు ప్రత్యేకంగా అభినందిచి ప్రశంసా పత్రాన్ని అంజేశారు.

## శివయ్య సన్నిధికి ఆషాఢం షాక్



**శ్రీకాళహస్తి, జులై 31 ప్రభాతవార్త** : ఎప్పుడూ రద్దీగా ఉండే శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆషాడం షాక్ తగిలింది. బుధవారం ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు కేవలం 14వేల మంది మాత్రమే దర్శించుకున్నారు.దాంతో ఆలయం వెల వెల బోయింది.గత వారం రోజులుగా ఇదే పరిస్థితి చోటు చేసుకుంది. గత 15 రోజులుగా ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది.

***తగ్గిన రాహుకేతుదోష నివారణ పూజలు:***

సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు ఎక్కువ మంది కాలసర్పదోష నివారణ పూజలు, రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకుంటారు. అయితే గత 15రోజులుగా ఈ పూజలు చేయించుకునే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాధారణంగా ఆదివారం కనీసం 6వేల పూజలు జరిగేవి.అలాంటిది బుధవారం 1500 దాటలేదు.సాయంత్రం వరకు అందించిన సమాచారం మేరకు 14200 మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శన టిక్కెట్లు రూ.200 టిక్కెట్లు 747 రూ.50ల టిక్కెట్లు 1088లు రాహుకేతుదోష నివారణ పూజల టిక్కెట్లు రూ.500లవి 1002 రూ.750ల టిక్కెట్లు 280,రూ.1500ల టిక్కెట్లు 105, రూ.2500ల టిక్కెట్లు 109, రూ.5వేల టిక్కెట్లు 18లు కొనుగోలు చేసి పూజలు జరుపుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. ఆలయంలో అభిషేకాలు 39, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 10 శనీశ్వరాభిషేకాలు 11 జరిగినట్లు ప్రకటించారు.

## పంచాయతీ కార్యదర్శి జాడ కోసం కలెక్టరుకు వినతి

**కుప్పంరూరల్, జులై 31 ప్రభాతవార్త** : రామకుప్పం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తన భార్య ఆచూకీ తెలియడం లేదని కార్యదర్శి, భర్త, కుమార్తెలు బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఈశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండలం గుండ్లసాగర ఒకు చెందిన తనకు రత్నబాయితో గత ఇరవై ఏళ్ల క్రితం వివాహమైందన్నారు. తన భార్య రామకుప్పం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తుందన్నారు. తనకు ఇద్దరు కుమార్తెలు సంతానం కలరని పేర్కొన్నాడు. తమ కాపురం సజావుగా సాగుతున్న సమయంలో ఐదేళ్ల క్రితం కుప్పం మండలం అనిమిగానిపల్లికి చెందిన ఎల్లప్ప కుమారుడు ఆర్ముగం అనే వ్యక్తి తన భార్యను లోబరచుకున్నాడని తన భార్య సైతం ఇంటికి రావడమే మానేసిందన్నారు. తన కుమార్తెలు హిమశ్రీ, అశ్రికలు తల్లిలేక ఆందోళన చెందుతున్నారన్నారు. గత కొంత కాలంగా తన భార్య ఫోన్ సైతం పనిచేయడం లేదని పేర్కొన్నాడు. తన భార్య ఆచూకీ కనుగొని తన పిల్లలకు న్యాయం చేయాలని లేకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని పేర్కొన్నాడు. ఈ విషయంగా ఆర్ముగంను 'ప్రభాతవార్త' వివరణ కోరగా తనకు పంచాయతీ కార్యదర్శికి మధ్య ఎలాంటి సంబంధం లేదన్నారు. భార్యభర్తల కుటు ంబ వ్యవహారంలో తనను అనవసరంగా లాగుతున్నారని పేర్కొన్నారు. ఈవిషయంగా తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.



## డిటిసి డిఎస్పీ శ్రావణ్‌కుమార్ ఏలూరు డిఎస్పీగా బదిలీ

**చిత్తూరు, జులై 31 ప్రభాతవార్త:** జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం డిఎస్పీ శ్రావణ్‌కుమార్ ఏలూరు టౌన్ డిఎస్పీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కుప్పం డిఎస్పీగా బదిలీపై వెళ్ళిన బి.శ్రీనాథ్ స్థానంలో బి.పార్ధసారధిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్ధసారధి విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్ నుండి కుప్పం డిఎస్పీగా బదిలీపై వస్తున్నారు.

## డిటిసి డిఎస్పీ శ్రావణ్‌కుమార్ ఏలూరు డిఎస్పీగా బదిలీ

**చిత్తూరు, జులై 31 ప్రభాతవార్త:** జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం డిఎస్పీ శ్రావణ్‌కుమార్ ఏలూరు టౌన్ డిఎస్పీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కుప్పం డిఎస్పీగా బదిలీపై వెళ్ళిన బి.శ్రీనాథ్ స్థానంలో బి.పార్ధసారధిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్ధసారధి విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్ నుండి కుప్పం డిఎస్పీగా బదిలీపై వస్తున్నారు.

## తిరుమల వాసులకు అందుబాటులోకి సచివాలయం : ఎమ్మెల్యే



**తిరుపతి కార్పొరేషన్, జులై 31 ప్రభాతవార్త** : బాలాజీ నగర్‌లో సచివాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భూమిపూజ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రూ. 50 లక్షలతో సచివాలయం నిర్మాణం కానుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత తిరుమలలో సచివాలయం ఏర్పాటు కావడం శుభపరిణామమని ఆయన అన్నారు. సచివాలయం అందుబాటులోకి వస్తే తిరుమల వాసులకు ప్రభుత్వ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని ఆయన చెప్పారు. తిరుమల నుంచే సిఎం చంద్రబాబు నాయుడు ప్రక్షాళన ప్రారంభించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన తిరుమల అధ్యక్షులు పగడాల మురళి, తిరుపతి నగర అధ్యక్షులు రాజారెడ్డి, జీవ, సుధా , రమణ, కుమార్, బాలు, విఘ్నేష్, భాస్కర్, పాండు, టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, రాజు యాదవ్, శివ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం చేయని న్యాయం... జనసేన చేసింది

### -హేమలత బాధితులకు ఎమ్మెల్యే ద్వారా విముక్తి



**తిరుపతి హెల్త్, జులై 31 ప్రభాతవార్త** : కొర్లగుంట, టిఎంఆర్ కళ్యాణ మండపం వెనక ఉన్న మెప్మా ఆర్పి హేమలత ఆగడాలను భరించలేక తిరుపతి ప్రెస్ క్లబ్ ద్వారా జనసేన పార్టీ 35 డివిజన్ భవాని నగర్ అధ్యక్షులు రాజేష్ ఆచారికి ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ద్వారా బాధిత మహిళలకు బుధవారం ఊరట లభించింది. ఎమ్మెల్యే ఫోన్ కాల్‌కు స్పందించిన మెప్మా అధికారిణి కృష్ణవేణి వెంటనే మహిళలను మోసం చేస్తున్న హేమలతను ఆర్పి స్థానం నుండి తొలగించారు. ఎన్నో సంవత్సరాలుగా మహిళా సంఘాల ముసుగులో హేమలత వారం వడ్డీ వ్యాపారాలు చేసుకుంటూ మహిళలను నిలువునా ముంచేస్తున్నట్లు బాధిత మహిళలు మొరపెట్టుకున్నారు. ఈ విషయం ప్రబలమవ్వడంతో గత వైసిపి ప్రభుత్వంలో జరగని న్యాయం కూటమి ప్రభుత్వం జనసేన పార్టీ ద్వారా జరిగిందని, మహిళలు గాయత్రి, లత, మలార్, శాంతి, గంగ, శ్రీదేవి, ఓంకార లక్ష్మి, మహేశ్వరి తదితరులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అధికారులు హేమలత వద్దనున్న చెక్కులు, బాండులను మోసపోయిన తమకు తిరిగి తీసి ఇవ్వాలని కోరారు. తమకు న్యాయం చేసిన జనసేన పార్టీకి ధన్యవాదాలు తెలిపారు.

## పర్యావరణహిత వినాయక విగ్రహాలు



**తిరుపతిటౌన్, జులై 31ప్రభాతవార్త:** తిరుపతి నగరంలో పర్యావరణహిత ,ప్లాస్టిక్ రహిత వినాయకుని విగ్రహాలను కొలువుదీర్చి ,అందరికీ ఆదర్శంగా పండుగను జరుపుకుందామని వినాయక నిమజ్జన కమిటీ పిలుపునిచ్చింది. వినాయకుని పండుగను, సామూహిక నిమజ్జన ఉత్సవాలను అందరూ కలసి సంతోషంగా నిర్వహించుకోవాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపు కునేందుకు స్థానిక ఎమ్మెల్యే, నగరపాలకసంస్థ, తుడ, టిటిడిసహకారం కోరాలని బుధవారం బాలాజీకాలనీలో జరిగిన తిరుపతి వినాయక మహోత్సవ కమిటీ సభ్యుల సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు సామంచి శ్రీనివాస్, గుండాలగోపీనాధరెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, మధు, నవీన్, వేణుగోపాల్‌నాయుడు, ఆనంద్, హేమకిరణ్, గోపీప్రసాద్, మణికంఠ,వాసు, సదాశివం, కృష్ణయ్య, శరత్,భాస్కర్‌నాయుడు,నటరాజ్,ఎస్వీఎంమోహన్,కరాటే శ్రీనివాస్, చందు పాల్గొన్నారు.

## సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయునికి స్నపనం



**తిరుపతిటౌన్, జులై 31ప్రభాతవార్త:** తిరుపతిలోని కోదండరామస్వామి ఉత్సవ మూర్తుల పరిరక్షణలో బాగంగా పవిత్రోత్సవాలు ఆరంభమయ్యాయి. ఆలయం లోని యాగశాలలో బుధవారం ఈ ఉత్సవాల్లో సీతారామలక్ష్మణసమేత ఆంజనేయ స్వామి ఉత్సవర్లకు విశేష స్నపనతిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు ఆలయ మాఢవీదుల్లో ఊరేగి భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, అర్చకులుపాల్గోన్నారు.

## నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



**శ్రీకాళహస్తి జులై 31 ప్రభాతవార్త** : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం చిత్తూరుకు సమీపంలోని తిరుప్పపల్లి పెనుమూరుకు చెందిన జి.కేశవులురెడ్డి, కృష్ణవేణిలు నిత్యాన్నదానానికి రూ.1లక్ష ఒక్క రూపాయి విరాళంగా అందించారు. వారు ఆలయ కార్యనిర్వహాణాధికారి ఎస్‌వియస్ఎన్‌మూర్తికి అందించారు.ఎసి మల్లికార్జున్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దాతలకు ప్రత్యేకంగా స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.

## విధి నిర్వహణలో చిరుద్యోగి



**శ్రీకాళహస్తి జులై 31 ప్రభాతవార్త** : శ్రీకాళహస్తి రహదార్లు భవనాల శాఖ సబ్‌డివిజన్‌లో పని చేసే చిరుద్యోగి బుధవారం ఉద్యోగవిరమణ చేసారు. ఆయనకు సబ్‌డివిజన్ కార్యాలయంలో సన్మానం ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా సుమారు 35 సంవత్సరాలకు పైగా పని చేసిన చెంగల్ రాయులు ఉద్యోగ విరమణ చేసారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిదిగా టిటిడి ఎఇఓ కృష్ణయ్య మాట్లాడుతూ చెంగల్‌రాయులు ఎంతో జవాబుదారి తనంతో విధి నిర్వహించారు. చెంగల్‌రాయులు దంపతులను దుశ్శాలువలతో సత్కరించారు. సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి గురవయ్య సత్కరించారు.

## ఆరోగ్యం, విద్య ప్రతి ఒక్కరికి తప్పనిసరి

**తొట్టంబేడు, జులై 31 ప్రభాతవార్త** : ప్రతి ఒక్కరికి ఆరోగ్యం, విద్య తప్పనిసరి అని అలాగే గిరిజన హక్కుల పరిరక్షణ మరియు అమలుపై 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని తుఫాన్ సెంటర్‌లో గిరిజన హక్కుల పరిరక్షణ మరియు అమలుపై అవగాహన కల్పించారు. హైకోర్టు ఆదేశాల మేరకు తుఫాన్‌సెంటర్‌లో బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు వారి హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. మరియు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఇంట్లోను ఆరోగ్యం, విద్య తప్పనిసరిగా ఉండాలని మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందని ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ద చూపాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రివైద్యులు మరియు సిబ్బంది తుఫాన్‌సెంటర్ వాసులు పాల్గొన్నారు.



## డిజిటల్ అసిస్టెంట్‌కు సత్కారం

**తొట్టంబేడు, జులై 31 ప్రభాతవార్త** : చియ్యవరం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వి.ఉదయభాస్కర్‌ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐజాక్ ప్రవీణ్, ఇఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, ఎఓ మధుసూధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఓ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. నేడు ప్రభుత్వ పథకాలు ఏవైనా వర్తించాలన్నా ఆధార్‌కార్డు తప్పనిసరిగా కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈనేపథ్యంలో స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేసినపుడు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులుతో పాటు సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్, జూనియర్ అసిస్టెంట్ మునిరత్నం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సామాజిక సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**శ్రీకాళహస్తి, జులై 31 ప్రభాతవార్త** : సామాజిక సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలుగుదేశంపార్టీ బిసి విభాగం రాష్ట్ర నాయకులు డాక్టర్ యం.ఉమేష్‌రావు తెలిపారు. నిస్వార్ధ సమాజ సేవ చేసినందుకు గుర్తింపుగా తమిళనాడు ఆసియా ఇంటర్‌నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న సంఘ సేవకులు వై.కోటేశ్వరబాబును తెలుగుదేశంపార్టీ బిసి విభాగం నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా పార్టీ నాయకులు మిన్నల్‌రవి, నెమళ్ళూరుబుజ్జి, కోటచంద్రశేఖర్, చింతగింజల సునీల్, సయ్యద్ చాంద్‌బాషా, బీమాల భాస్కర్ ముదిరాజ్, కృష్ణమూర్తి, శివ, రమేష్, వ వెంకటస్వామి, ఆదిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# తిరుపతి డివిజన్

## ఘనంగా ఆండాల్ అమ్మవారి తిరువాడిపుర ఉత్సవం



**నారాయణవనం, జులై 31 ప్రభాతవార్త** : ఆడినెలలో జరిగే ఆండాల్ అమ్మవారి తిరువాడిపుర ఉత్సవాలు బుధవారం సాయంత్రం మూడవ రోజు కూడా ఘనంగా జరిగింది. నారాయణవనం మేజర్ పంచాయతీలో వెలసిన టిటిడి ఆలయం పద్మావతీదే సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో కొలువుదీరిన ఆండాల అమ్మవారి తిరువాడిపుర ఉత్సవం 10 రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం జరుగనుంది. ఈ సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టడానికి సహకరించాలి : సిడిపిఓ



**నారాయణవనం, జులై 31 ప్రభాతవార్త** : బాల్య వివాహాలను అరికట్టడం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని పిచ్చాటూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి తెలిపారు. మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీ ఈశ్వరీయానాధికాలనీ, పడవేటమ్మ యానాధికాలనీలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం కలిగే అనర్థాల గురించి వివరించారు. ఇకపోతే చుట్టు ప్రాంతాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. కావున పరిశుభ్రంగా వుంచుకొని వేడి నీళ్లను తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బేబి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శిక్ష సప్తహ్ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి



**పాకాల, జులై 31, ప్రభాతవార్త** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా పాకాల మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ రోజు నుంచి తిథి భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని మండలం విద్యా శాఖాధికారి బాబ్జి తెలిపారు. ఆయన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొండపల్లి నందు జరిగిన తిథి భోజన కార్యక్రమంలోఆయన పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, దాత సులోచన, ఉపాధ్యాయులు రామకృష్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన 76వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు



పాకాల, జులై 31 ప్రభాతవార్త : పాకాల మండలం ఊట్లవారిపల్లె ఆనందగిరి పై వెలసి వున్న శ్రీ వల్లి దేవసేన షణ్ముఖ సుబ్రమణ్య స్వామి వారి 76వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఆద్యాంతం వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో చివరి రోజు అయిన బుధవారం ఉభయదారులు యశోదమ్మ రామచంద్ర నాయుడు చేతులు మీదుగా యాగపూజ, పూర్ణాహుతి, సాయంత్రం కలిశాభిషేకం తోట ఉత్సవం కార్యక్రమాలన్నీయు కన్నుల విందుగా సాగింది. తదుపరి కంకణ విసర్జన ధ్వజారోహణము సేవ రాత్రి వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి పొన్ను సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులు ఎస్. మధుమోహన్ చౌదరి, ఎస్.ప్రసాదరావు(బుజ్జి) ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీకృష్ణుడు



**చంద్రగిరి, జులై 31 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, అర్చకులు కేనమకులపల్లి రాజు, సిబ్బంది రవిచంద్రన్, తిరువేంగడం, జేమేదర్ మంకు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి..!



**రామచంద్రాపురం, జులై 31 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు పిలుపు నిచ్చారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో ప్రకృతి వనం వ్యవస్థాపకుడు ఎంసివి ప్రసాద్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిలో ఎన్నో ఔషధ గుణాలు కలిగిన మూలికలు వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.సుమలత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే నివాళి



**విజయపురం, జులై 31 ప్రభాతవార్త:** మండలంలోని కేవీ పురంలో టీడీపీ సీనియర్ నాయకుడు బాబునాయుడు సతీమణి మాజీ సర్పంచ్ సుమతి ఇటీవల అనారోగ్యంతోమృతి చెందారు. బుధవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆమె చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు వేణుగోపాల్‌నాయుడు, గోవర్ధన్, మధునాయుడు, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని సేవలు ప్రశంసనీయం : ఎంఈవో



**విజయపురం, జులై 31 ప్రభాతవార్త:** మండలంలోని విజయపురం ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడు గంగయ్య సేవలు ప్రశంసనీయమని ఎంఈవో హరిప్రసాద్‌వర్మ పేర్కొన్నారు. బుధవారం విజయపురంలో పదవీ విరమణ కార్యక్రమం ఏర్పాటు చేసి ఆయన సేవలను కొనియాడి పూలమాల, శాలువలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామల, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.ఎస్.నాయుడు, ముత్యాలరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రయ్యపాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణా క్షమించరాని నేరం



**రేణిగుంట, జులై 31 ప్రభాతవార్త:** మానవ, ముఖ్యంగా బాలల అక్రమ రవానా చట్టరీత్యా క్షమించరాని నేరమని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ సూపర్‌వైజర్ హైమావతి అన్నారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లె, మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం క్రై చైల్డ్ రైట్స్-యూ, ప్రగతిస్వచ్చంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో హైమావతి మాట్లాడుతూ ముందుగా ప్రతి ఒక్కరు స్వీయ సంరక్షణను నేర్చుకోవాలన్నారు. సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే వనజాక్షి, ప్రగతి జయలక్ష్మి, పాఠశాలల బోధన బోధనేతర సిబ్బంది, ప్రగతి ప్రతినిధులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## ఇంటి వద్దకే ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



**తిరుపతి కార్పొరేషన్, జులై 31 ప్రభాతవార్త** : తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని లబ్ధిదారులకు ఆగష్టు 1వ తేదిన ఉదయం 5 గంటల నుంచే ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేయనున్నామని, అందరూ అందుబాటులో ఉండాలని కమిషనర్ నారపురెడ్డి మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బందికి, అధికారులను ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

## మీ సేవలు అమోఘం



తిరుపతి జిల్లాలో సుదీర్ఘకాలం పోలీసుసేవలందించి పదవీవిరమణ చేసిన వారిని ఘనంగా సన్మానించారు.

ప్రభాతవార్త-తిరుపతి

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి : జిల్లా కలెక్టర్




రామకుప్పం, జూలై 31 ప్రభాతవార్త : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి లాభసాటి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కడ పి.డి. వికాస్ మర్మత్‌తో కలసి రామకుప్పం మండలంలో ఉద్యానరంగంలో విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు అంశంపై రైతులతో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో చాలామంది రైతులు వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడ్డారన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొంది ఆర్థికంగా బలోపేతం చెందాలన్నారు. రైతుల పంటలకు మంచి మార్కెటింగ్ సౌకర్యం అవసరం ఉందన్నారు. కుప్పం ప్రాంతంలో 18 రకాల ఉద్యానవన, 12 రకాల వాణిజ్య పంటలు రైతులు సాగు చేస్తున్నారన్నారు. 6500 ఎకరాల్లో టమోటా సాగు ఏడాది పాటు జరుగుతుందన్నారు. బీన్స్,పూలసాగు, పళ్లు, కూరగాయలు, పూల ఎగుమతి అధికంగా ఉందన్నారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ ఆగస్టు 10న కుప్పం కడ కార్యాలయంలో రైతులు బ్యాంకర్ల ద్వారా రుణాలు పొందేందుకు అవసరమైన వివరాలు, ఆదాయ మార్గాలు తదితర అంశాలపై సమావేశం జరుగుతు ఒదన్నారు. తొలుత కుప్పంలో పండించే పళ్లు, కూరగాయలతో చేయదగ్గ ప్రాసెసింగ్ యూనిట్లు, మార్కెటింగ్, ఎగుమతులపై కలసి పనిచేద్దామన్నారు. కాగా ఉపాధిహామీ పథకాన్ని రైతులకు అనుసంధానం చేయాలని కలెక్టరును మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. సమావేశంలో ఎపిఎంఐపి పిడి బాలసుబ్రమణ్యం, చిన్నతరహా పరిశ్రమల పిడి శ్రీనివాసులు, ఎల్‌డిఎం హరీష్, డిహెచ్‌ఓ మధుసూధన్‌రెడ్డి, ఎడి కోటేశ్వరరావు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునస్వామి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, రామూర్తి, గంట్లప్పగౌడు, చిన్నికృష్ణ, చలపతి,బాబు, సీతాపతి పాల్గొన్నారు.

# నిమ్మలో పూత నియంత్రణతోనే అధిక దిగుబడులు




వెంకటగిరి, జులై 31 ప్రభాతవార్త : రైతులు నిమ్మపూతను రాళ్ళనివ్వకుండా చూసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర అధిపతి డాక్టర్ బిజి రాజులు తెలిపారు. వెంకటగిరి కృషి విజ్ఞాన కేంద్రంలో నిమ్మలో అధిక దిగుబడి కోసం పూత నియంత్రణ పద్ధతులు పై శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించారు. కెవికె ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డా. బి. గోవింద రాజులు మాట్లాడుతూ నిమ్మలో పూత నియంత్రణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పూత నియంత్రణపై కరపత్రం విడుదల చేశారు. గిబ్బరెల్లిక్ ఆమ్లంని రైతులకు ఇవ్వడం జరిగింది. తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి బి. దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యాన విభాగంలోని వివిధ రకాల పథకాలు ఉన్నాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకాలు వాటి ఉపయోగాలు రైతులకు వివరించారు. కెవికె ఉద్యాన శాస్త్రవేత్త డా. డి. తిరుపాల్ నిమ్మలో పూత నియంత్రణ కోసం గిబ్బేరెల్లిక్ అమ్లం, సైకోసెల్, 13.0.45 వాడే విధానాలు గురించి రైతులకు వివరించారు. మృత్తికా విభాగం శాస్త్రవేత్త డా. ఐ. రజీవన మాట్లాడుతూ నిమ్మ సూక్ష్మ పోషకాలు, వాటి నివారణ గురించి చెప్పారు. పొదలకూరు, గూడూరు ఉద్యాన అధికారులు ఈ. ఆనంద్, ఆర్. కార్తీక్‌లు నిమ్మతోటల్లో సస్య రక్షణ విధానాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఉద్యాన అధికారులు జి. ఆనంద్ రెడ్డి, కె. శారద, యుఎస్ఎల్ మిథిల, కెవికె శాస్త్రవేత్తలు డా. బి. విజయశ్రీ, డా. పి. నాగార్జున రెడ్డి, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి 8 మండలాల నిమ్మ రైతులు పాల్గొనడం జరిగింది.

**CHANGE OF NAME**

I,**NUTHALAPATI MADHAVI** (old Name), R/at DNo.2-48, Mitta Indlu, Kakavedu (v), Nagari (M),Chittoor Dist. A.P. I Have chnaged my surname as **KATUKOTA MADHAVI** W/o NUTHALAPATI RAMESH (New Name).

I,**RAGURU PRASAD RAO** S/o Raguru Ankaiah (Old Name), R/at Flat No.101, Primark essars Enclave, Upadyaya Nagar, Tirupati Dist. A.P. I have changed my name surname as **RAVURU PRASAD RAO** S/o Ravuru Ankaiah Naidu (New Name)

# ఆలయ ప్రతిష్ట పెంపొందించే విధంగా ప్రణాళికలు : ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి జూలై 31 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చే భక్తులకు ఇక 'కూల్ కూల్' దర్శనం అవకాశం కల్పించుటకు చర్యలు తీసుకోవాలని అలాగే శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్, ఆర్‌టిసి బస్టాండు వద్ద దిగిన ప్రతి భక్తునికి ఉచిత బస్సు సదుపాయం కల్పించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆలయంలోని పరిపాలనా భవనంలో ఆయన అధికారులు,అర్చకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా మాస్టర్‌ప్లాన్ అమలుపై చర్చ జరిగింది. ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కిషోర్ పవర్ పాయింట్ ద్వారా ఎలా ఉంటుందో వివరించారు. తరువాత వివిధ అంశాలపై అధికారులతో ఎంఎల్‌ఏ సమీక్షించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సత్వర, సుదర్శనంతో పాటు చల్లటి వాతావరణం కల్పించుటకు ఆలయాన్ని సెంట్రల్ ఏసి చేయాలని అందుకు సంబంధించిన నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. గతంలో ఆలయంలో పలు అవకతవకలు జరిగాయని అవినీతి మయంగా మారిందని తాను ప్రక్షాళన చేసి చూపుతామని తెలిపారు. ఇక దూర ప్రాంతాల నుంచి రైలులో, ఆర్‌టిసి బస్టాండుకు వచ్చే యాత్రికులను దేవస్థానం వద్దకు చేర్చుటకు ఉచిత బస్సులను నడపాలని ఆదేశించారు. ఇక్కడ ఎవరైనా భక్తులకు ఇబ్బంది పెడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ మేరకు సంబందిత పోలీసు అధికారులకు సూచించాలని ఎంఎల్‌ఏ సమావేశంలో వివరించారు.

**గుడిమల్లం ఆలయ అభివృద్ధిపై దృష్టి:**

చారిత్రాత్మక ఆలయాలు తమ నియోజకవర్గంలో ఉన్నాయని వాటిని అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి సూచించారు. పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉన్న గుడిమల్లం ఆలయాన్ని తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శాసనసభ్యుడుగా ఉన్నపుడు దత్తత తీసుకొని అభివృద్ధి పరచుటకు ప్రణాళికలు రూపొందించారని కానీ తరువాత వచ్చిన పాలకులు దానిని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయం పై భాగాన్ని పూణేకు చెందిన నిపుణులు లీకేజీల అరెస్టుకు స్వచ్ఛందంగా పనులు చేస్తున్నారని వారిని అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డితో పాటు ఇఓ ఎన్‌వియస్ ఎన్ మూర్తి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓలు హేమామాలిని,సతీష్‌మాలిక్, ఏకే ధనపాల్, లోకేష్‌రెడ్డి, యుగంధర్, నాగభూషణం యాదవ్, హరియాదవ్, సుదర్శనం నాయుడు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి డిఇఇ శ్రీనివాసులురెడ్డి, కిషోర్, విజయసారధి, నాగయ్య, రవి,ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, తెలుగుదేశం పార్టీకి చెందిన పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు,మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గందరగోళం మధ్య సాగిన మున్సిపల్ సమావేశం

### -ప్రభుత్వ స్థలాలు కాపాడాలని సమావేశంలో కౌన్సిలర్లు ఫిర్యాదు



వెంకటగిరి, జులై 31 ప్రభాతవార్త : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గందరగోళంగా జరిగింది. మున్సిపాలిటీల్లో ఉన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి కౌన్సిలర్లు తీసుకొచ్చారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలయ్య తాను స్మశానాన్ని బాగుచేస్తే బిల్లు ఎందుకు పెట్టలేదని చైర్‌పర్సన్ భానుప్రియను ప్రశ్నించారు. పని పూర్తి చేసినట్లు ఫోటోలు ఇతర వివరాలు ఇవ్వలేదని చైర్ పర్సన్ సమాధానమిచ్చారు. ఈ విషయమై సమావేశంలో కౌన్సిలర్లు వైస్ చైర్మన్ మధ్య వాగ్వాదం జరిగింది. అన్ని స్మశానానికి వచ్చిన బిల్లును వైస్ చైర్మన్ బాలయ్య ఒక్కడే తీసుకోవడం సబబుగా లేదని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మశానాల అభివృద్ధికి ఉన్న నిధులను కౌన్సిలర్ అందరికీ సమానంగా ఇవ్వాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చైర్‌పర్సన్‌ను తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పోలేరమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా వీధిలైట్లు వేయించాలని తాగునీటి సరఫరా చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. పోలేరమ్మ ఆలయం చిహ్నంతో పట్టణంలో ఎమ్మెల్యే సొంత నిధులతో ఒక ద్వారం ఏర్పాటు చేస్తారని ఎందుకు మున్సిపాలిటీ అనుమతిస్తున్నట్లు చైర్ పర్సన్ భానుప్రియ తెలిపారు. మున్సిపాలిటీలో విలువైన స్థలాలను కొందరు కబ్జా చేసినట్లు ఐదవ వార్డు కౌన్సిలర్ నారిశేఖర్ ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలో స్థలాల్లో కట్టిన కట్టడాలకు గత కమిషనర్ పనులు వేసి వారి సొంతంగా చూపించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపాలిటీలోని పలు సమస్యలను కౌన్సిలర్లు తెలపగా పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో అజెండాలోని అంశాలను ఆమోదించారు. వైస్ చైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు పూజారి లక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, ఎంఏ నారాయణ, శేఖర్, గోపాలకృష్ణ, సుబ్బారావు, ధనియాలు రాధా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## క్రమం తప్పకుండా ఆయిల్‌బాల్స్

### - మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ



చిత్తూరు, జులై 31 ప్రభాతవార్త: మురికినీటి కాలువల్లో నీరు నిల్వ వుండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నీటి నిల్వ ప్రాంతాల్లో అనునిత్యం స్ప్రేయింగ్ కార్యక్రమాలు నిర్వహించి, ఆయిల్‌బాల్స్ వేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ బుధవారం నగరంలో పలు చోట్ల విస్తృతంగా పర్యటించి పారిశుధ్య నిర్వహణపై తనిఖీలు నిర్వహించారు. కయనికట్టువీధి, ఖాదర్‌మిరాన్ వీధుల్లో కమీషనర్ పర్యటించి పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. కాలువల్లో పూర్తి స్థాయిలో పూడిక తీయాలని, తీసిన పూడికను పూర్తి స్థాయిలో తొలగించాలని ఆదేశించారు. అలాగే కాలువల్లో పారిశుధ్య సిబ్బంది చేస్తున్న స్ప్రేయింగ్ కార్యక్రమంను పరిశీలించి పలు సూచనలు చేశారు. వీధులను పరిశుభ్రంగా వుంచాలని ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను పడవేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించేలా స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే స్థానికంగా జరుగుతున్న నీటి సరఫరాను పరిశీలించి మంచినీటి సరఫరా ఎలా జరుగుతుందని ప్రజలను ప్రశ్నించారు. పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న నీటిని కచ్చితంగా ప్రారంభం, మధ్య, చివరిలో ఆర్సీ టెస్టులు చేయాలన్నారు. నీటి లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అక్కడి నుండి కమీషనర్ ఓబనపల్లి గంగమ్మ ఆలయం వెనుకవైపు వున్న నిల్వ నీటి కుంటను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల కట్టడిలో బాగంగా నిల్వ నీరు ఎక్కడా నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వార్డుల్లో నిల్వ వున్న నీటిల్లో వారానికి ఒకసారి ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. అలాగే ఈ సందర్భంగా కమీషనర్ అంగన్‌వాడీ, వైద్య సిబ్బందికి దిశానిర్ధేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఇ వెంకటప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు లోకనాథం, అమరనాదరెడ్డి, ఎఇ రవీంద్ర, వార్డు క్యాదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం డిఎస్పీగా పార్థసారథి నియామకం



కుప్పం, జూలై 31 ప్రభాతవార్త : కుప్పం పోలీస్ డివిజన్ డిఎస్పీగా బి.పార్థసారథిని నియమిస్తూ రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పార్థసారథి విజయవాడ సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్‌లో డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇదివరకు కుప్పం డిఎస్పీగా పనిచేసిన బండారు శ్రీనాథ్‌ను ఇంటెలిజెన్స్ డిఎస్పీగా నియమిస్తూ పోస్టింగ్ వెకేట్‌లో నియమించారు.

## తిరుమల వింగ్ విఎస్‌ఓగా రామ్‌కుమార్ -తిరుపతికి సురేంద్ర



తిరుమల,జులై 31ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ధార్మికసంస్థలో విజిలెన్స్ సెక్యూరిటీ విభాగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా విజిలెన్స్ వింగ్ విఎస్‌ఓగా ఎస్టీవి రామ్‌కుమార్‌ను నియమించారు. ఇక్కడ ఉన్న గిరిధర్‌ను పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. తిరుపతి విఎస్‌ఓగా సురేంద్రను నియమించారు. ఇక్కడ ఉన్న బాలిరెడ్డిని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టుచేసుకోవాలని ఉత్తర్వులు జారీచేశారు. కాగా రామ్‌కుమార్ గతంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో తిరుపతి,చిత్తూరులో ఎస్‌ఐ,సిఐగా, డిఎస్పీగా సమర్థవంతంగా విదులు నిర్వహించారు. సోమవారం రామ్‌కుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు.

## వైషమ్యాలు మాని అభివృద్ధికి శ్రీకారం

### -కౌన్సిల్ సమావేశంలో ఛైర్మన్,కౌన్సిలర్ల ఏకకంఠం -వైకాపా కౌన్సిలర్ల గైర్హాజరు




పుంగనూరు, జూలై 31 ప్రభాతవార్త : పట్టణ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టే పథకాలు విజయవంతం చేయడానికి సంపూర్ణంగా సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా అన్నారు. కమీషనర్ నర్సింహప్రసాద్ సారథ్యంలో బుధవారం ఉదయం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఛైర్మన్‌తో సహ ఇటీవల వైకాపా నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన కౌన్సిలర్లు మాత్రమే పాల్గొన్నారు. వైకాపా నుంచి గెలుపొందిన కౌన్సిలర్లు మాత్రం సమావేశానికి హాజరుకాలేదు. ఈసమావేశానికి అధ్యక్షత వహించిన ఛైర్మన్ సభను ప్రారంభిస్తూ గతాన్ని వదలి భవిష్యత్తుకు పునాది వేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు, దేశం నాయకులు చల్లాబాబుల సారథ్యంలో పురోభివృద్ధి సాధించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీనియర్ కౌన్సిలర్ ఎం. వెంకటరమణరాజు మాట్లాడుతూ పగలు, ప్రతీకారాలు, కక్ష్యలు, దారుణాలతో ఇంత వరకు చాలా చెడ్డపేరు సాధించిన పుంగనూరు పట్టణాన్ని ప్రక్షాళనచేసే దిశగా నూతన అభివృద్ధికి,శాంతికి కౌన్సిల్ సంకేతంగా నిలవాలన్నారు. ప్రతిపాదన చేసిన పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

## సిఎం చంద్రబాబును కలసిన కుప్పం రెస్కో ఉద్యోగులు



కుప్పం, జూలై 31 ప్రభాతవార్త : కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార స ంఘం (రెస్కో)లో పనిచేస్తున్న నలభైమంది రెగ్యులర్ ఉద్యోగులు బుధవారం సిఎం చంద్రబాబునాయుడును కలిశారు. ఈసందర్భంగా తమ సమస్యలను సిఎంకు వివరించారు. తాము గత నాలుగేళ్లుగా కుప్పం రెస్కోలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నామన్నారు. ఆర్నెల్లు వేతనాలు సైతం అందలేదన్నారు. అనంతరం తమకు డైలీ వేజెస్ కింద రూ 12500లు ఓచర్ వేతనాలు ఇచ్చారన్నారు. అయితే తమను రెగ్యులర్ చేయాలని కోరగా 15/10/2022న నలభైమందిని రెగ్యులర్ చేసి వేతనాలు చెల్లిస్తూవచ్చారన్నారు. ఇటీవలి కాలంలో రెస్కోలో విచారణలు జరుగుతుండడం, మరో పక్క జాయింట్ కలెక్టరు తమకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసిందన్నారు. తమ కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తమకు న్యాయం చేయాలని వారు ముఖ్యమంత్రిని కోరారు.

## ఆగస్ట్ 5లోపు అన్నా క్యాంటీన్ల పనులు : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జులై 31 ప్రభాతవార్త : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో వునః ప్రారంభానికి సిద్ధం చేస్తున్న అన్నా క్యాంటీన్ల పనులు ఆగస్టు 5 లోపు పూర్తి చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం తెల్లవారు జామున రాజన్న పార్కు సమీపంలోని మాస్టర్ గది వద్ద ఉద్యోగుల హాజరు నమోదును కమిషనర్ పరిశీలించారు.

## సిఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఏమరాల్డ్స్ విజయకేతనం



తిరుపతి విద్య, జులై 31 ప్రభాతవార్త : ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ విడుదల చేసిన సిఏ ఫౌండేషన్ ఫలితాల్లో స్థానిక ఎల్ఐసి రోడ్డులో ఉన్న ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమి విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు విద్యా సంస్థల డైరెక్టర్లు ఈ గిరిధర్, కె. విశ్వనాథ్‌లు ప్రకటించారు. ఈ ఫలితాల్లో రాధిక, ప్రణవ్, లిఖిత్, సుశీలేంద్ర రావు, సరిత అత్యధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. ఈ అద్భుత ఫలితాలు సాధించినందుకు ఉపసంచాలకులు మునిరత్నం నాదముని, జానకిరామ్, శ్రీనివాసులు, అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు.

## విధి నిర్వహణలో పదవీ విరమణ సర్వసాధారణం

### -ఏపి ఎన్జీవో అధ్యక్షులు చెంచురత్నం



శ్రీకాళహస్తి, జూలై 31 ప్రభాతవార్త : ఉద్యోగ విధి నిర్వహణలో పదవీవిరమణ సర్వసాధారణం అని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏపి మినిస్ట్రీరియల్ పంచాయతీరాజ్ కార్యదర్శి,శ్రీకాళహస్తి తాలూకా ఎన్జీవో అధ్యక్షుడు చెంచురత్నం యాదవ్ అన్నారు. బుధవారం శ్రీకాళహస్తి ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదవీవిరమణ చేసిన నూరుల్లాను బుధవారం దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా చెంచురత్నం యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధి నిర్వహణలో ఎంతో బాధ్యతగా వ్యవహరించడం అనంతరం పదవీ విరమణ చేయడం సర్వసాధారణమన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని సమర్థవంతంగా విధులు నిర్వహించిన నూరుల్లా దంపతులను ఎన్జీవో నాయకులు దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి మెమొంటోను అందించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఆర్ఓ, ఏపి ఎన్జీవో అసోసియేట్ అధ్యక్షులు నారాయణ, మాజీ ఎన్జీవో అధ్యక్షులు పయని, తెలుగుగంగ అధికారి రాజగోపాల్, విశ్రాంతఅగ్నిమాపకాధికారి దుర్గాప్రసాద్, ఆలీ, విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ తదితరులతో పాటు అద్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీగా రామకృష్ణాచారి

### డిఎస్ఆర్‌పి డిఎస్పీగా హర్షిత

తిరుపతిటౌన్, జులై 31ప్రభాతవార్త: తిరుపతిజిల్లాలో పలువురు డిఎస్పీలు బదిలీ అయ్యారు. బుధవారం మధ్యాహ్నం 96మంది డిఎస్పీలను బదిలీ చేసిన డిజిపి ద్వారాక తిరుమలరావు తిరుపతి జిల్లాలోపలువురికి స్థాన చలనం కలిగించారు. తిరుపతి నగర డిఎస్పీగా ఉన్న రవిమనోహచారిని సిఐడికి, తిరుమల డిఎస్పీ శ్రీనివాసాచారిని కర్నూలు దిశకు, పివిపిలో దిశలో ఉన్న ఎస్ఆర్ హర్షితను తిరుపతి డిఎస్ఆర్‌పి డిఎస్పీగా, తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీగా పి.రామకృష్ణమా చారిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. తిరుపతి డిఎస్ఆర్‌పిలో ఉన్న డిఎస్పీ షనుషేక్‌ను బదిలీ చేశారు. విజయవాడలో ఉన్న డిఎస్పీ బి.పార్థసారధిని చిత్తూరు జిల్లా కుప్పం డిఎస్పీగా నియమించారు. కాగా తిరుమల,తిరుపతినగర డిఎస్పీల స్థానాలను భర్తీచేయలేదు.





**N.B.K.R.**
**INSTITUTE OF SCIENCE & TECHNOLOGY**
( AUTONOMOUS )
Affiliated to JNTUA, Anantapuramu
Re-Accredited by NAAC with 'A' Grade
Accredited by NBA under Tier –1 (ECE,EEE,CSE,ME & CE)
VIDYANAGAR-524 413, Tirupati Dt., A.P.
Established 1979

**I B.TECH. CATEGORY-B (NON-NRI) ADMISSIONS - 2024**

**Applications are invited for admission into I B.Tech. under Category – B (Non-NRI) seats in the following branches:**

| Course | ECE | EEE | CSE | CIV | MEC | AID |
|---|---|---|---|---|---|---|
| Category - B (Non-NRI) | 108 | 36 | 180 | 18 | 36 | 36 |

**Application forms can be obtained from the College Office on payment of Rs.500/- or downloaded from the website : www.nbkrist.org**

Last date to submit the filled-in applications is **05.08.2024**. Applications should be sent along with copies of relevant certificates and Registration Fee of **Rs.1000/- ( APEAPCET/JEE-2024 Qualified) and Rs.1200/- (APEAPCET/JEE-2024 Not appeared/Not Qualified)** either by cash or **D.D** in favour of ***Director, NBKRIST, payable at Union Bank,Vidyanagar EC Branch (1160),Vidyanagar, Tirupati Dist.***

For more details Contact : **94415 72755**

**Date: 31-07-2024** **DIRECTOR**